## క్లుప్తంగా

### నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించే ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ప్రారంభమవుతుందన్నారు. కావున ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

### ఆధ్యాత్మికతతోనే సత్ప్రవర్తన



ఆధ్యాత్మికతపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్న సునీత

కిర్లంపూడి: ఆధ్యాత్మికతతోనే సత్ప్రవర్తన సాధ్యమని కాకినాడ జిల్లా అన్నమయ్య కళాక్షేత్ర సమన్వయకర్త దిడ్డి సునీత అన్నారు. ఆదివారం ఆమె ఆధ్వర్యంలో చిల్లంగిలోని పుర గిరిక్షత్రియ (పెరిక) రామాలయం వద్ద చిన్నారులకు సర్వతోముఖ వికాస తరగతులు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలకు భగవద్గీత, విష్ణుసహస్రనామాలు, గోవింద నామాలు, లలితాపారాయణంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రతి ఆదివారం సెలవు దినం రోజు నిర్వహించే సర్వతోముఖ వికాస తరగతుల ద్వారా చిన్నారులకు ఆధ్యాత్మికతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

### ముగిసిన ఐదు రోజుల శిక్షణ



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య అధ్యాపకులు, సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫౌండేషన్ ఆఫ్ క్వాంటమ్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై ఐదు రోజులపాటు అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా రంగంలో క్వాంటమ్ టెక్నాలజీ ఆవశ్యకతపై ఈ కార్యక్రమం జరిగినట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యాసంస్థల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారని వెల్లడించారు.

### నీట్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందనలు



నీట్ ర్యాంకర్ వైష్ణవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఆదివారం గుబ్బాలమ్మ తల్లికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు చేశారు. గుబ్బాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్‌లో 532 ర్యాంక్ సాధించిన గొల్లపల్లి వైష్ణవిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనపరచడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. అనంతరం ఆమె తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులందరూ వైష్ణవిని ఆదర్శంగా తీసుకొవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణదాతలుగా పేరొందాలి

బాలాజీచెరువు: రక్తదానంతో ప్రాణదాతలుగా పేరొందాలని అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణన్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు పేర్కొన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో ఆదివారం రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నారావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న యువకులు రక్తదానం చేయాలని, రక్తదానంపై అపోహలు తొలగి స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. అనంతరం రక్తదాతలకు అభినందనలు తెలియజేసారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ పి.కామరాజు,డి.రామకృష్ణ, జిల్లా ఛైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

### 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఎస్పీ సమీపంలో శ్రీలలితా వారాహి రాజ శ్యామల సన్నిధానం (హ్రీం పీఠం)లో ఈనెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు సజావుగా జరగాలని కోరుతూ ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్టు నిర్వహకుడు ఈశ్వర్ తెలియజేశారు. ఈ నెల 26 నుంచి జూలై 5 వరకు ప్రతి రోజు అమ్మ వారికి పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహిస్తామని, అమ్మ వారి దీక్ష తీసుకునే వారికి ఇక్కడే పూజలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలియజేవారు.

# నడుములు విరిగేలా గుంతలు..

- కాత్రావులపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయం
- రోడ్డు మంజూరైందని, మరమ్మతులు నిలిపివేత
- డబుల్ లెన్ రోడ్డుకు రూ.2 కోట్లతో ప్రణాళికలు
- ఎనిమిది గ్రామల ప్రజలు అవస్థలు



గుంతల్లో చేరిన వర్షపు నీరు



ట్రాఫిక్‌తో రద్దీతో కాత్రావులపల్లి జంక్షన్

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లిలో మెయిన్‌రోడ్డు గోతుల మయంగా మారింది. వర్షం పడితే రోడ్డు చెరువులను తలపిస్తోంది. రాబోయేది వర్షాకాలం, రోడ్డు మరింత దారుణంగా మారడం ఖాయం. రోడ్డు మరమ్మతులకు ఆర్ అండ్‌బీ వద్ద నిధులు ఉన్నా గోతులు పూడ్చకుండా వదిలేశారు. దీనికి కారణం కాత్రావులపల్లి మెయిన్‌రోడ్డును డబుల్ రోడ్డు చేసే ప్రతిపదనలు సిద్ధం చేయడం. ఈ రోడ్డు మార్గం ద్వారా ఎనిమిది గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి.

**మరమ్మతులకు నిధులు మంజూరు**

కాత్రావులపల్లి పెట్రోలు బంక్ జంక్షన్ నుంచి రామేశంపేట వరకూ వున్న 6.కిలోమీటర్ల రోడ్డును మరమ్మతులు చేయడానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.30లక్షల విడుదల చేసింది. 2025 జనవరిలో నిధులు మంజూరు కాగా ఏప్రిల్ నెలాఖరుకు 6.కిలోమీటర్ల మేర ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు పూర్తి చేయాలి. రామేశంపేట నుంచి కాత్రావులపల్లి పొలిమేర వరకూ రూ.20 లక్షలు ఖర్చు చేసి రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి, గ్రామ పొలిమేర నుంచి పెట్రోలు బంక్ వరకూ వున్న రోడ్డును అధికారులు వదిలేశారు.

**రూ.2 కోట్లతో ప్రతిపాదనలు**

మెయిన్‌రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్ పెరిగి రోడ్డు ఇరుకుగా మారింది. కాత్రావులపల్లి సెంటర్‌లో ప్రయాణం అనితర సాధ్యం. దీన్ని దృష్టిలో పెట్టుకుని డబుల్ లైన్ రోడ్డు వేయాలని ఆర్అండ్‌బీ అధికారులు సంకల్పించారు. కాత్రావులపల్లి మెయిన్‌రోడ్డు ప్రస్తుతం 3.75 మీటర్లు వెడల్పు ఉంది. దీనిని 7మీటర్ల వెడల్పు చేసి కిలోమీటర్ మేర సిమ్మెంట్ రోడ్డు వేయాలని ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి సుమారు 2.కోట్ల రూపాయిలు ఖర్చుకాగలదని అంచనావేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇది జరిగి మూడు నెలలు అయింది. దీనికి నిధులు మంజూరు అయిన వెంటనే కాత్రావులపల్లి మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు తొలగించి అధికారులు విశాలమైన రోడ్డు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**మరమ్మతులు ఎందుకని**

ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డు వేసే అవకాశం ఉన్నప్పుడు, పాతరోడ్డుకు మరమ్మతుల వృధా అని అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ కారణంతోనే నిధులు ఉన్నప్పటికి గోతులు పూడ్చకుండా వదిలేశారు. మరి నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో అప్పటి వరకు ఈ గోతులతో అవస్థలు పడక తప్పదు.

**అందుకే ఆపాం**



గోతులు పూడ్చడానికి నిధులు ఉన్నాయి. డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు అయితే ఇప్పుడు ఉన్న రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు వేయాలి. పనిఅంతా వృధా అవుతుందని ఆలోచించి ప్రస్తుతానికి గోతులు పూడ్చకుండా ఆపాం. ఇబ్బందులను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళతాం.

– సాయికుమార్, ఆర్అండ్‌బీ ఎఇ.జగ్గంపేట

**ఆక్రమణలు తొలగించాలి**



స్థానిక సంతమార్కెట్ ప్రాంతంలో దారుణంగా ఆక్రమించేయడంతో ప్రయాణీకులు అనేక కష్టాలు పడుతున్నారు. స్థానిక నేతలు ఎవరు పట్టించుకోవటం లేదు. కొత్త రోడ్డు ఎప్పుడో వస్తుందని ప్రస్తుతం వున్న రోడ్డుపై గోతులు అలావదిలేయడం దారుణం.

– జుత్తుగ నాగేశ్వరరావు, బహుజన సమాజ్‌వాది పార్టీ ఇన్‌చార్జీ

## జగనంటే నమ్మకం.. బాబు అంటే మోసం



సిరిపురంలో కూటమి ఏడాది పాలనపై పుస్తకం ఆవిష్కరిస్తున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు ఓ భరోసా, నమ్మకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం జగనంటే నమ్మకం,చంద్రబాబు అంటే మోసం పేరిట కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ముద్రించిన పుస్తకాన్ని గిరిబాబు ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ చరిత్రలో ఎన్నడూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఇప్పటివరకు సూపర్‌సిక్స్ అమలుచేయడంలో విఫలమైందన్నారు. నమ్మిన ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఇప్పటికైనా సూపర్‌సిక్స్ అమలుచేయాలన్నారు. చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు గొల్లపల్లి సురేష్, గుమ్ములూరి వెంకటరమణ, యిజనగిరి ప్రసాద్, అల్లం ఆదినారాయణ, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, మజ్జూరి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్రతతో అవస్థలు



కోటనందూరు శివారు మల్లవరం సెంటర్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

కోటనందూరు: మండల కేంద్రం కోటనందూరులో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా దర్శనమిస్తోంది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పల్లో పందులు సంచరించి కలుషిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీయక నీరు ముందుకు కదలడం లేదని, శివారు ప్రాంతాల్లో కాలువలు మురుగుకూపాలను తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండు సెంటర్లో మరిడమ్మ గుడి నుంచి పోలీసుస్టేషన్ వరకు తుని–నర్సీపట్నం రోడ్డుపై మురుగు తాండవిస్తోంది. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గూడ్స్ వాహనంపై కేసు



నిబంధనలకు విరుద్ధంగా ప్యాసింజర్లను తరలిస్తున్న గూడ్స్ వాహనం

జగ్గంపేట: నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్యాసింజర్స్‌ను తరలిస్తున్న ఓ గూడ్సు వాహనంపై కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునందన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడ్స్ వాహనాలలో ప్రయాణికులు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.

**నలుగురు జూదరులు అరెస్ట్**

జగ్గంపేట శివారు జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.5,100 నగదును స్వాధీనం చేసుకున్నామని, అలాగే మండలంలోని గోవిందపురంలో పేకాట ఆడుతున్న మరో ఇద్దరుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

జగ్గంపేట మండలం రామవరంలో కోడిపందాల నిర్వహణకు ప్రయత్నిస్తున్న ఆరోపణలపై బాబు అనే వ్యక్తి పై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం



వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలతో కమాండెంట్ నాగేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంప్ ముగింపోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జాతీయ స్థాయిలో 12 మంది, రాష్ట్ర స్థాయిలో 20 మంది, జిల్లా స్థాయిలో 26 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. వీరందరికీ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు పతకాలను ప్రదానం చేశారు. వేసవి శిబిరంలో బాస్కెట్‌బాల్ క్రీడలో మెళకువలు నేర్చుకున్న పిల్లలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, మాజీ అథ్లెట్ ప్రసాద్, సీనియర్ ప్లేయర్ పిల్ల సత్యనారాయణ, ఆర్‌ఐలు అజయ్‌కుమార్, వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఉచిత న్యాయ సేవలు



ప్రత్తిపాడులో న్యాయ అవగాహన సదస్సుకు హాజరైన వయో వృద్ధులు

ప్రత్తిపాడు: వృద్ధులు ఉచిత న్యాయ సహాయం కోసం ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రతీ శనివారం జరిగే న్యాయ అవగాహన సదస్సులో కోరవచ్చని కోర్టు ప్యానెల్ అడ్వకేట్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కార్యదర్శి బుగత శివ పేర్కొన్నారు. ప్రపంచ వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జాతీయ రహదారిపై చెంతన ఉన్న శ్రీ శారదా వయో వృద్ధ నిలయంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బుగత శివ మాట్లాడుతూ వృద్ధుల హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చన్నారు. వృద్ధుల చట్టాలు–హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్యానెల్ అడ్వకేట్ బొంగుకూరి మధుబాబు, శ్రీ శారదా వయో వృద్ధ నిలయం ఛైర్మన్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చినుకుపడితే చిత్తడే..!




సగరుపేటలో మట్టి చిత్తడిగా మారడంతో కంకర వేసుకుంటున్న స్థానికులు

గండేపల్లి: చినుకుపడితే చిత్తడిగా మారి వీధివాసులకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. కాలు బయటకు పెట్టలేని పరిస్థితుల్లో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. మండలంలోని నీలాద్రిరావుపేటలో హైవేని ఆనుకుని ఉన్న సగరుపేటలో సీసీ రోడ్డుపై మట్టిని వేసి వదిలేయడంతో అక్కడి స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నివాస స్థావరాల మెట్లకు మించిన ఎత్తులో రోడ్డును మట్టితో నింపేయడంతో వర్షం కురిసి చిత్తడిగా మారి అడుగులోతు మట్టిలో కాలు కూరుకుపోవడంతో బయటకు రాలేకపోతున్నామన్నారు. ద్విచక్ర వాహనాలను ఇంటికి తెచ్చుకోలేక తెలిసిన వాళ్ల ఇంటివద్ద దాచుకుంటున్నామన్నారు. శని, ఆదివారంలో కురిసిన వర్షానికి రోడ్డుపై వేసిన మట్టి చిత్తడిగా మారడంతో హైవేపై తొలగించిన కంకర పిక్కలను తెచ్చుకుని ఇళ్ల ముందు వేసుకుని బయటకు వచ్చేందుకు మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలో కొందరు అభివృద్ధి పేరిట అవగాహనలేని పనులు చేస్తుండటంతో ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

## కుండపోతగా పలకరింపు

- మూడు గంటలు ఏకధాటిగా వర్షం
- అల్లకల్లోలంగా సముద్ర తీరం
- మత్స్యకారులకు అధికారుల హెచ్చరికలు



దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు

తొండంగి: నైరుతి రుతుపవనాల జోరు, మరో వైపు బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల అవర్తన ద్రోణి ప్రభావంతో మండలంలోని ఆదివారం కుండపోత వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి సుమారు మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఏ.కొత్తపల్లి, బెండపూడి, గోపాలపట్నం, సీతారాంపురం, రావికంపాడు ఎస్సీకాలనీ తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటుకల బట్టీలు, తాండ్ర బట్టీలు మూతపడ్డాయి.

**ఎగేసిపడుతున్న అలలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల అవర్తన ద్రోణి ప్రభావంతో ప్రభావంతో మండలంలోని సముద్ర తీరప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగేసిపడుతున్నాయి. దానవాయిపేట, అద్దరిపేట, కొత్తచోడిపల్లిపేట, తాటియాకులపాలెం, పంపాదిపేట, పెరుమాళ్లపురం తదితర తీరాల్లో సుమారు రెండు మీటర్ల వరకూ అలలు ఎగేసిపడటంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. తీరప్రాంతాల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అనుకూల పరిస్థితులు ఏర్పడే వరకూ వేటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. ఎటువంటి ఇబ్బందుల్లో మత్స్యకారులు చిక్కుకున్నా తమకు సమాచారం అందించాలన్నారు.

## చదువులమ్మ నీడలో జ్ఞాపకాల కలబోత



1996-97లో ములగపూడి జెడ్పీ హైస్కూల్లో పదివ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు

రౌతులపూడి: చదువులమ్మ చెట్టునీడలో చెట్టాపట్టాలేసుకుని కలసి తిరిగిన ఆ స్నేహితులు మళ్లీ 29 ఏళ్ల తరువాత ఆదివారం ఒకచోటుకు చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా తమ సంతోషాలను పంచుకున్నారు. మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదివ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులు అంతా ఒక చోటకు చేరి గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి ఉపాధ్యాయులను వారంతా పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వారంతా తమతమ జీవితంలో స్థిరపడిన విధానాలను, పరిస్థితులను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం వారంతా పాఠశాల ఆవరణలో గూపు ఫొటో దిగి తమ పూర్వ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసుకున్న సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

### సత్యదేవుడిని దర్శించిన కోనసీమ ఎస్పీ



ఎస్పీ కృష్ణారావుకు ప్రసాదాలను అందజేస్తున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: డాక్టర్.బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెంట్ బీ.కృష్ణారావు కుటుంభ సభ్యులతో కలిసి ఆదివారం రత్నగిరిపై ఉన్న సత్యదేవుడిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులకు ఆలయం పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు, స్వామివారి ప్రసాదాలను అందచేశారు. ఆలయ విశిష్ఠతను ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులకు వివరించారు.

### ప్రతిభా పురస్కారాలు ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్న దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్టు సభ్యులు

తుని: పట్టణంలోని స్థానిక పల్లపువీధి గల గౌరీశంకర సమేత వీరభద్రస్వామి ఆలయంలో తుని దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశరు. ఇటీవల వెలువడిన పది, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆరుగురు దేవాంగ విద్యార్థిని, విద్యార్థులకు ఆదివారం ట్రస్టు అధ్యక్షుడు దొంతంశెట్టి నందిమల్లిఖార్జునరావు పురస్కారాలను అందజేశారు. ట్రస్టు ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జాన గౌరీశంకర్, డాక్టర్ బూడిద వీరభద్రుడు, గోరు సాయిచంద్రశేఖర్, తూతిక సూర్యనాగేశ్వరరావు, జాన సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



కత్తిపూడిలో ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించి, గ్రామ వ్యాప్తంగా బ్లీచింగ్, దోమల మందు పిచికారి చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ఈ మేరకు సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

### చిరునామ తెలపారు..



గోపాలపట్నంలో అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద మతిస్థిమితం లేని మహిళ

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద కొద్ది రోజులుగా మతిస్థిమితం లేని మహిళ దిక్కుతోచని స్థితిలో ఉంది. గోపాలపట్నం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద సుమారు 30 ఏళ్ల వయస్సున్న మహిళ మతిస్థిమితం లేకపోవడంతో చిరునామా చెప్పలేకపోతుంది. స్థానికులు కొద్ది రోజులుగా ఆమెకు మూడుపూటలా ఆహార పదార్థాలు అందిస్తున్నారు. ఆమె చిరునామ తెలుసుకుని కుటుంబీకులకు చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.